మనం
కృష్ణా / గుంటూరు
ఎన్‌టీఆర్ - బాపట్ల - పల్నాడు
శనివారం | 12 | జూలై | 2025 | పేజీలు : 6

## దుర్గమ్మను దర్శించుకున్న మంత్రి

**విజయవాడ పశ్చిమ, జూలై 11 (మనం న్యూస్):** శుక్రవారం రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర దంపతులు ఇంద్రకీలాద్రిపైన వేంచేసి ఉన్న కనకదుర్గమ్మను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వేద పండితులు వేద ఆశీర్వచనాలిచ్చారు. మంత్రి దంపతులకు అమ్మవారి చిత్రపటాన్ని, ప్రసాదాన్ని దుర్గగుడి అధికారులు అందజేశారు.



# ఇంద్రకీలాద్రి అభివృద్ధే లక్ష్యంగా ఎమ్మెల్యే సుజనా మాస్టర్ ప్లాన్


సామాన్య భక్తులకు పెద్దపీట వేసేలా ప్రణాళికలు
సుజనా చొరవతో మారనున్న ఇంద్రకీలాద్రి రూపురేఖలు

-విజయవాడ పశ్చిమ, మనం న్యూస్





2 లో



ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శుక్రవారం రాజ్ భవన్ లో గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ తో మర్యాదపూర్వకంగా సమావేశమయ్యారు. ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ అభివృద్ధి కార్యక్రమాల గురించి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గవర్నర్ అబ్దుల్ నజీర్ కు వివరించారు.

# హాస్టళ్లను ఆకస్మిక తనిఖీ చేస్తాం

హాస్టల్ విద్యార్థులకు తల్లిదండ్రులు సంక్షేమ అధికారులే
హాస్టల్ పరిసరాలు పచ్చదనంతో పరిశుభ్రంగా ఉండాలి
ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ



5 లో

-విజయవాడ సెంట్రల్, మనం న్యూస్

# ప్రొహిబిషన్ కేసులలో పట్టుబడిన ద్విచక్ర వాహనాల వేలం

**జగ్గయ్యపేట జులై 11 మనం న్యూస్ :** ఎక్సైజ్ శాఖ వారు దాడుల సందర్భంగాస్వాధీనం చేసుకున్న వాహనాలను శుక్రవారం బహిరంగ వేలం నిర్వహించారు. పట్టణంలోని ప్రొహిబిషన్ ఎక్సైజ్ కార్యాలయం వద్ద వేలం కార్యక్రమాన్ని నిర్వహించారు. పూర్తి కండిషన్లో ఉన్న వాహనాలు కూడా మార్కెట్ రేటుకంటే తక్కువ ధరకు పాటదారులకు లభించాయి. వేలం ద్వారా 11 వాహనాలను విక్రయించగా ప్రభుత్వ ఖజానాకు ఒక లక్ష 50 వేల 450 రూపాయలఆదాయం సమకూరినట్లు ఎక్సేంజ్ ఇన్స్పెక్టర్ గురవయ్య తెలిపారు. 11 వాహనాలకు సుమారు1 లక్ష 5 వేలుఆదాయం వస్తుందని అంచనా వేయగా అంచనాకి మించి ఆదాయం లభించడం విశేషం. ఈ సందర్భంగా ఎక్సైంజ్ శాఖ అధికారులు అసిస్టెంట్ సూపర్వైజర్ విజయవాడ ఆర్ వి రామ శివ, జగ్గయ్యపేట ఇన్స్పెక్టర్ బి గురవయ్య , జగ్గయ్యపేట ప్రొహబిషన్ ఎక్సైజ్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



# ప్రజలను చైతన్యవంతం చేయడంలో మీడియా పాత్ర ఎంతో కీలకం

- **కలెక్టర్ డీకే బాలాజీ**




**మచిలీపట్నం, జూలై 10 (మనం న్యూస్):** సమాజంలో మార్పు కోసం ప్రజలను అన్ని విధాలుగా చైతన్యవంతం చేయడంలో మీడియా పాత్ర ఎంతో కీలకం అని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ పేర్కొన్నారు.మచిలీపట్నం మండలం, వలందపాలెంలోని జీ కన్వెన్షన్ హాల్లో కేంద్ర సమాచార ప్రసార మంత్రిత్వ శాఖ ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో వారి ఆధ్వర్యంలో వార్తలాప్ పేరుతో జర్నలిస్టులకు మీడియా కార్యశాల నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొనగా, ఆయనతో పాటు ఏపీఎస్ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ సివిల్ జడ్జి కెవి రామకృష్ణయ్య, హిందూ న్యాయ కళాశాల ప్రిన్సిపల్ వీ ఎఫ్ రాయలు, జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ అధ్యక్షుడు బండి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల్లో చైతన్యం తీసుకురావాలన్నా, ప్రభుత్వ నిర్ణయాలు, పథకాల ఉద్దేశం ప్రజలకు చేరాలన్నా మీడియా ప్రముఖ పాత్ర పోషిస్తుందన్నారు. క్షేత్రస్థాయిలో మీడియా నుంచి వచ్చే అభిప్రాయం (ఫీడ్ బ్యాక్) ప్రభుత్వాలకు ఎంతో ఉపయోగపడుతుందని, దీని ద్వారా లోటుపాట్లను సరి చేసుకునేందుకు ఇది ఎంతో ఉపయోగపడుతుందని తద్వారా ఇది ప్రజలకు పరోక్షకంగా సహాయం చేస్తుందన్నారు.అయితే ప్రభుత్వం చేసే మంచి పనులను సైతం ప్రజలకు తెలియచెప్పాల్సిన అవసరం కూడా ఎంతో ఉందని చెబుతూ, రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా జిల్లాలో 16 మంది అనాథ పిల్లలను వివిధ ప్రాంతాలలో తల్లిదండ్రులకు దత్తత ఇచ్చామని అది తనకు ఎంతో సంతృప్తినిచ్చిందని ఈ సందర్భంగా తెలియజేశారు. కొత్త ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం గడిచిన సందర్భంలో జిల్లాలో సాధించిన అభివృద్ధిని పుస్తక రూపంలో తీసుకొచ్చామని, ఆ సమాచారాన్ని మీడియాకు త్వరలోనే అందిస్తామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ పథకం పీఎం సూర్యఘర్ ఒక గొప్ప పథకం అని, దీనిని ప్రజలు సద్వినియోగం చేసుకునేలా విస్తృత ప్రచారం కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఏపీఎస్ఆర్టీసీ చైర్మన్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యానికి నాలుగో స్తంభంగా ఉన్న జర్నలిజం, రాసే నిష్పక్షపాత వార్తల వల్ల సమాజంలో గొప్ప మార్పు తీసుకురావచ్చు అన్నారు. ప్రజల సంక్షేమానికి ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాల పట్ల అవగాహన కల్పించాలని, ప్రజలను చైతన్యవంతం చేసే వార్తలను రాయాలని ఆయన ఆకాంక్షించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ సివిల్ జడ్జి కెవి రామకృష్ణయ్య మాట్లాడుతూ న్యాయ సేవాధికార సంస్థ ద్వారా బడుగు బలహీన వర్గాల ప్రజలకు ఉచిత న్యాయ సేవలు అందిస్తున్న విధానాన్ని వివరిస్తూ, చట్టాలు, ఉచిత న్యాయ సేవలపై ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో (పిఐబి) కార్యకలాపాలు, అందిస్తున్న సేవలను ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో ఏడి రమేష్ చంద్ర పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. మీడియా అవసరాలు తీర్చడం, విలేకరుల సమావేశాలు, కేంద్ర ప్రభుత్వ మంత్రిత్వ శాఖలు, విభాగాలు, నీతి అయోగ్, ఎన్నికల సంఘం మొదలైన సంస్థల కార్యక్రమాల ప్రచారం తదితర విధులను పిఐబి నిర్వహిస్తున్నట్లు వివరించారు.

# ఇంద్రకీలాద్రి అభివృద్దే లక్ష్యంగా ఎమ్మెల్యే సుజనా చౌదరి సరికొత్త మాస్టర్ ప్లాన్

**మొదటి పేజీ తరువాయి...**

దుర్గమ్మ అనుగ్రహంతో విజయవాడ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యేగా గెలుపొందిన యలమంచిలి సత్యనారాయణ (సుజనా చౌదరి) పశ్చిమంలో సంక్షేమాన్ని అందిస్తూనే ఇంద్రకీలాద్రి అభివృద్ధికై నడుంబిగించారు. ఎవరి మనోభావాలు దెబ్బతినకుండా ఆగమ శాస్త్రం ప్రకారం ఆలయాన్ని అభివృద్ధి చేస్తున్నారు. భక్తుల భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకొని అత్యుత్తమ నైపుణ్యం కలిగిన స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్ విజయవాడ వారిచే బృహత్తర ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు, ఇంద్రకీలాద్రి పై ఘాట్ రోడ్డు అభివృద్ధి , వాహనాల పార్కింగ్, ఎలివేటెడ్ క్యూ కాంప్లెక్స్, విశ్రాంతి భవనాలను నిర్మించి ఆలయంలో మౌలిక సదుపాయాలను మెరుగుపరుస్తూ పచ్చదనాన్ని ప్రోత్సహిస్తూ ఆధ్యాత్మికత ఉట్టిపడేలా ప్రణాళికలను సిద్ధం చేస్తున్నారు. రాబోయే 50 ఏళ్ళను అంచనా వేస్తూ నిపుణుల సలహాలు, సూచనలు స్వీకరిస్తూ తన బృందంతో మాస్టర్ ప్లాన్ అమలుకు శ్రీకారం చుట్టారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఏమాత్రం అభివృద్ధికి నోచుకోని ఇంద్రకీలాద్రి అభివృద్ధికై సుజనా అహర్నిశలు శ్రమిస్తున్నారు. దేవాదాయ శాఖామాత్యులు ఆనం రామనారాయణ రెడ్డి, విజయవాడ పార్లమెంటు సభ్యులు కేశినేని శివనాథ్ ( చిన్ని) దేవాదాయ శాఖ కమిషనర్ రామచంద్ర మోహన్, నగర పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖర్ బాబు సంబంధిత అధికారులతో కలిసి మాస్టర్ ప్లాన్ అమలుకై సమీక్ష నిర్వహిస్తున్నారు. కృష్ణా పుష్కరాల నాటికి ఆలయ తొలిదశ అభివృద్ధి పనులను పూర్తిచేసేలా నిరంతరం కృషి చేస్తున్నారు. శాశ్వత ప్రాతిపదికన క్యూ లైన్ల నిర్మాణం, వాహనాల పార్కింగ్,భక్తుల విశ్రాంతి భవనాల నిర్మాణం, ప్రసాదం పోటు, అన్నప్రసాద కేంద్రం, మరియు తాగునీటి సౌకర్యాలను మెరుగుపరిచి కేశఖండన శాలలను నిర్మించి క్రౌడ్ మేనేజ్మెంట్ వంటి పలు అంశాలపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ ఎప్పటికప్పుడు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో సంప్రదింపులు జరుపుతూ ఆయన సలహాలు సూచనలను తీసుకుంటున్నారు. భక్తులకు త్వరితగతిన అమ్మవారి దర్శన భాగ్యం కల్పించేలా చర్యలను చేపడుతున్నారు. దసరా ఉత్సవాల సమయంలో అవుతున్న వృధా ఖర్చులను తగ్గించి ఇంద్రకీలాద్రిని శాశ్వత ప్రాతిపదికన అభివృద్ధి చేసి క్యూ లైన్ల ఆధునీకరణ ద్వారా భక్తులకు శీఘ్ర దర్శనం కల్పించడమే లక్ష్యంగా అడుగులు వేస్తున్నారు. ప్రసాద్ పథకం ద్వారా కేంద్రం నుంచి అదనపు నిధులను తీసుకువచ్చే ప్రయత్నం చేస్తూ అధికారుల, ప్రజాప్రతినిధుల సమన్వయంతో ఏపీ లోనే రెండవ అతిపెద్ద ఆలయమైన ఇంద్రకీలాద్రి రూపురేఖలు మార్చడానికి ఎమ్మెల్యే సుజనా చౌదరి ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారు.

# దోమల నివారణకు ఫ్రైడే డ్రై డే కచ్చితంగా పాటించాలి

- **విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర హెచ్‌ఎం ఆదేశాలు**



**విజయవాడ సెంట్రల్, జూలై 11 (మనం న్యూస్):** దోమల వల్ల కలిగే వ్యాధుల నుండి నివారణ కొరకు ఫ్రైడే డ్రై డే నిర్వాహణతో ప్రజలకు అవగాహన కల్పించాలని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. శుక్రవారం ఉదయం పుచ్చలపల్లి సుందరయ్య స్కూల్, సింగ్ నగర్ లో ఫ్రైడే డ్రై డే కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజలు దోమల బారిన పడకుండా ఉండేందుకు అవగాహన కల్పించారు. అందులో భాగంగా అక్కడ నివసిస్తున్న ప్రజల వారి ఇళ్లలో ఉన్న నీటి నిల్వలను శుభ్రం చేస్తూ ప్రతి ఫ్రైడే డ్రై డే నిర్వహించాలని, వారికి అవగాహన కల్పిస్తూ దోమలు పెరగకుండా యాంటీ లార్వా ఆపరేషన్లు నిర్వహించారు. ప్రతి శుక్రవారం ఫ్రైడే డ్రై డే పాటించడం వల్ల ప్రజలు దోమలను కచ్చితంగా, దోమ కాటు వల్ల అనారోగ్యం పాలవకుండా ఉండవచ్చని సిబ్బంది ప్రజలతో అవగాహన కల్పించారు. అంతేకాకుండా సైడ్ డ్రైన్లలో పూడికలు తీయడం, ఎమెల్ ఆయిల్స్ స్ప్రే చేయటం కలగట్ల వద్ద ఫాగింగ్ చేయడం వంటి ఆంటీ లార్వా ఆపరేషన్లు నిర్వహించి దోమలను నియంత్రించేందుకు చర్యలు తీసుకున్నారు అధికారులు. తదుపరి సింగ్ నగర్ అన్న క్యాంటీన్ ను పరిశీలించి, ప్రతిరోజు నోడల్ ఆఫీసర్లు కచ్చితంగా తమ తమ అన్న క్యాంటీన్లను పరిశీలించి ఎటువంటి లోపం లేకుండా మరమ్మతులు లేకుండా ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉంటూ చూసుకోవాలని అధికారులని ఆదేశించారు. అక్కడున్న ప్రజలతో మాట్లాడి అన్న క్యాంటీన్ లో ఉన్న వసతుల సంబంధిత అభిప్రాయాలని తెలుసుకున్నారు. ప్రజలు వసతులన్నీ బాగున్నాయని, వారికి ఎటువంటి ఇబ్బందులు లేవు అని కమిషనర్ గారికి తెలిపారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ కే ప్రభుదాస్, బయాలజిస్ట్ కామేశ్వరరావు, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్ మలేరియా వర్కర్లు పాల్గొన్నారు.

# జగ్గయ్యపేట నుండి ఇంగ్లాండ్ క్రికెట్ ఆడేందుకు ఎంపికైన యువక్రీడాకారులను అభినందించిన ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్



**జగ్గయ్యపేట జులై 11 మనం న్యూస్:** జగ్గయ్యపేట క్రీడా రంగ చరిత్రలోగర్వకారణంగా నిలిచిన మరో ఘనత నిలిచింది.ఈ ఏడాది జరిగిన అండర్-19 క్రికెట్ టోర్నమెంట్ లలో అద్భుత ప్రతిభ కనబరిచి, వెంగ్ సర్కార్ ఫాండేషన్ ద్వారా భారత దేశం లోని అన్ని రాష్ట్రాల నుండి మెరుగైన ప్రదర్శన చేసిన వారిలో ఎంపికైన టీం లో జగ్గయ్యపేట పట్టణం లోని ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ క్రికెట్ కోచ్ నిమ్మల రాజేంద్ర ప్రసాద్ దగ్గర శిక్షణ తీసుకొన్న యువక్రీడాకారులు వరుణ్ సాత్విక్, రాజేష్ ఎంపికయ్యారు. యువ క్రీడాకారులనుఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ తాతయ్య ప్రత్యేకంగా అభినందించారు.జగ్గయ్యపేట పట్టణంలోని జీవిజె బాయ్స్ హై స్కూల్ నందు గల స్టేడియం వద్దకు ఎమ్మెల్యే రాజగోపాల్ స్వయంగా వచ్చి వారిని అభినందించారు. ఈ సందర్భంగా ఇంగ్లాండ్ వీసా స్టాంపింగ్ అయిన పాస్పోర్ట్ లను తమ చేతుల మీదుగా వారికి అందజేశారు. జగ్గయ్యపేట యువక్రీడాకారులు అంతర్జాతీయ స్థాయికి అడుగులు వేయడం గర్వకారణం అని అన్నారు. వీరి విజయాలు స్థానిక క్రీడాకారులకు స్ఫూర్తిగా నిలుస్తాయి. మన నియోజకవర్గం నుండి మరింతమంది ప్రతిభావంతులు ప్రపంచవేదికపై అద్భుత ప్రదర్శన చూపేలా కృషి చేస్తాం అని తాతయ్య తెలిపారు. క్రీడలు యువతలో ఆత్మవిశ్వాసం, శారీరక దృఢత్వం పెంచే సాధనమని ఎమ్మెల్యే రాజగోపాల్ అన్నారు.ప్రతి ఇంటి నుండి ఒక ఆటగాడిని తీర్చిదిద్దే లక్ష్యంతో నియోజకవర్గంలో ఆధునిక క్రీడా మైదానాల అభివృద్ధికి తనదైన శైలిలో ముందడుగు వేస్తున్నట్లు చెప్పారు. జగ్గయ్యపేటలో ఇప్పటివరకు ఎంతో మంది క్రికెట్ క్రీడాకారులను తయారుచేసిన కోచ్ రాజేంద్రను ప్రత్యేకంగా ఎమ్మెల్యే రాజగోపాల్ అభినందించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శ్రీరాం సంజయ్ కృష్ణ,మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, పట్టణం తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి మైనేని రాధాకృష్ణ,కౌన్సిలర్ పేరం సైదేశ్వర రావు, నోముల రఘు, పి.ఎం.ఎస్.ఆర్ బాబ్జి, యామర్తి బోస్ యాదవ్, ఏ సి ఏ కోచ్ నిమ్మల రాజేంద్రప్రసాద్,బివి సుధీర్, బాషా తదితరులు పాల్గొన్నారు. ఇంగ్లాండ్ టూర్ ఎంపికైన యువ క్రికెటర్ రాజేష్ కు పదివేల రూపాయలు అందించిన శ్రీరాం కృష్ణ పవన్ జగ్గయ్యపేట నియోజకవర్గం గర్వకారణంగా ఇంగ్లాండ్ టూర్ కు ఎంపికైన యువ క్రికెటర్ రాజేష్ ని అభినందిస్తూ ఎమ్మెల్యే శ్రీరామ్ రాజగోపాల్ కుమారుడు శ్రీరామ్ కృష్ణ పవన్ ( కిట్టు) పదివేల రూపాయల ప్రోత్సాహకాన్ని అందించారు. శుక్రవారంఎమ్మెల్యే రాజగోపాల్ చేతుల మీదగా నగదు ప్రోత్సాహకాన్ని అందించారు.

# శాకంబరిగా దర్శనమిచ్చిన గాయత్రి అమ్మవారు

**జగ్గయ్యపేట జూలై 11 మనం న్యూస్ :** పట్టణంలోని గాయత్రి నగర్లో వేంచేసియున్న శ్రీ గాయత్రి అమ్మవారి ఆలయంలో అమ్మవారిని శాకాంబరిగా అలంకరించారు. పట్టణంలోని గాయత్రి బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో గాయత్రి అమ్మవారి ఆలయంలో వివిధ రకాల కూరగాయలతో అమ్మవారిని శాకంబరిగా అలంకరించారు. శుక్రవారం ఉదయం అమ్మవారికి పంచామృత అభిషేకాలు ప్రత్యేక పూజలు అనంతరం వివిధ రకాల కూరగాయలు పండ్లతో అమ్మవారికి అలంకారాన్ని నిర్వహించారు .ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. గాయత్రి బ్రాహ్మణ సంఘం అధ్యక్షులు కలవకొలను వీరాంజనేయ శర్మ, ప్రధాన కార్యదర్శి మాడపాటి కిషోర్, కోశాధికారి మంగు చైతన్య, తదితర గాయత్రి బ్రాహ్మణ సంఘ సభ్యులు భక్తులుపెద్ద సంఖ్యలో మహిళ లు అమ్మవారిని దర్శించుకున్నారు.



### పట్టణంలోని పలు ఆలయాలలో అమ్మవారికి శాకాంబరిగా అలంకారాలు

పట్టణంలోని నకాసి బజారులో వేంచేసియున్న కనకదుర్గ అమ్మవారి ఆలయంలో అమ్మవారిని వివిధ రకాల పండ్లు కూరగాయలతో శాఖాంబరిగా అలంకరించారు .ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టణంలోని ఈశ్వరి దేవి మందిరం బ్రహ్మంగారి గుడిలో అమ్మవారికి శాకాంబరి అలంకారాన్ని నిర్వహించారు. పట్టణంలోని చంద్రమౌళీశ్వర స్వామి ఆలయం ( పెద్ద శివాలయం) అమ్మవారిని శాకాంబరిగా అలంకరించి ప్రత్యేక పూజలను నిర్వహించారు. పట్టణంలోని కృష్ణ మందిరంలో సౌందర్యలహరి సామూహిక పారాయణన్ని నిర్వహించారు. చంద్రమౌళీశ్వర స్వామి వారికి ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు.

# చంద్ర బాబు పాలనలో రాష్ట్రంలో అభివృద్ధి పరవళ్ళు



- ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య)

**జగ్గయ్యపేట జూలై 11 మనం న్యూస్:** ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సారథ్యంలో రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం పరవళ్ళు తొక్కుతున్నాయని ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ తాతయ్య అన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా జగ్గయ్యపేట పట్టణంలో 5వ వార్డు వైవై కాలనీలో పర్యటించిన ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ తాతయ్య ప్రభుత్వ పథకాలను ఇంటింటా ప్రచారం చేశారు. ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వైసిపి ఐదేళ్ల పాలనలో రాష్ట్రం విధ్వంసానికి గురైందని, లక్షల కోట్ల మేర రాష్ట్రం అప్పులు ఊబిలో కూరుకుందని గుర్తు చేశారు. చంద్రబాబు అధికారంలోకి రాగానే పింఛన్లను రూ.3 వేల నుండి రూ. 4వేలకు పెంచారని ఎమ్మెల్యే రాజగోపాల్ గుర్తు చేశారు. తల్లికి వందనం కింద ఇంట్లో ఎంతమంది చదువుకునే పిల్లలు ఉంటే అందరికీ రూ. 15,000 చొప్పున అందించామన్నారు. ఇచ్చిన హామీ మేరకు దీపం 2 పథకాన్ని అమలు చేశామన్నారు. త్వరలోనే అన్నదాత సుఖీభవ పథకం అమలుకు రంగం సిద్ధం చేశారని, ఆగస్టు 15 నుండి మహిళలకు ఉచిత బస్సు సేవ అమల్లోకి వస్తుందన్నారు. సూపర్ సిక్స్ పథకాలు అమలకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ తాతయ్య స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర తెలుగుదేశం పార్టీ నేతలు సిమ్మసత్తి వెంకటేశ్వర్లు తదితర తెదేపా నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఎల్.ఓ.సీని అందజేసిన ఎమ్మెల్యే కార్యాలయ కార్యదర్శి

**విజయవాడ పశ్చిమ, జులై 11 ( మనం న్యూస్ ):** ఎమ్మెల్యే సుజనా చౌదరి సౌజన్యంతో మంజూరైన లెటర్ ఆఫ్ క్రెడిట్ ఎల్.ఓ.సి ను శుక్రవారం భవానిపురం ఎన్డీఏ కార్యాలయంలో కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్, కూటమి నేతలతో కలిసి బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. 48 వ డివిజన్ వాగు సెంటర్ కు చెందిన అమర చైతన్య (37) హృద్రోగం తో బాధపడుతూ హైదరాబాదులోని యశోద హాస్పిటల్ లో చికిత్స పొందుతున్నాడు తనకి మెరుగైన వైద్యం అందించాలని వైద్యులు తెలపడంతో వారు టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఎమ్ ఎస్ బేగ్ ను కలిశారు.ఆయన ఎన్డీఏ కార్యాలయంలో వైద్యం సాయం కోసం దరఖాస్తు చేయగా రూ 5 లక్షల ఎల్.ఓ.సీ పత్రాన్ని బాధితుడు భార్య నాగలక్ష్మికు ఎమ్మెల్యే కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్ కూటమి నేతలతో కలిసి అందించారు. త్వరితగతిన ఎల్.ఓ.సీ మంజూరు చేసిన ఎమ్మెల్యే సుజనా చౌదరికి బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. సుజనా మిత్రా కోఆర్డినేటర్లు సప్పా శ్రీనివాస్, దొడ్డ రాజా, కొల్లి దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.



# జాలి స్విమ్మింగ్ పూల్ ప్రారంభించిన తెలుగు యువత అధ్యక్షుడు లంక లితీష్



**మైలవరం జులై 11మనం న్యూస్:** స్థానిక మైలవరం మండలం, మైలవరం లోని పొందుగల రోడ్డు నందు జాలి స్విమ్మింగ్ పూల్ ను తెలుగు యువత అధ్యక్షుడు లంక లితీష్, సర్పంచ్ మంజు భార్గవి, మాజీ డిఇ నాగమల్లేశ్వరరావు ప్రారంభించినారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుత మానవ జీవన విధానం లో స్విమ్మింగ్ అనేది ఎంతో ఆరోగ్య వంతమైనదని, స్విమ్మింగ్ చేయడం వల్ల మనిషి దృఢంగాను, ఉల్లాసంగా ఉంటారన్నారు. దీనిని ప్రతి ఒక్కరు ఉపయోగించు కోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత, స్థానిక నాయకులు,పాల్గొన్నారు.

# సివిల్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో అధ్యాపక అభివృద్ధి శిక్షణా కార్యక్రమం

**మైలవరం జులై 11 మనం న్యూస్:** స్థానిక లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజనీరింగ్ సివిల్ ఇంజనీరింగ్ మరియు జె.యన్.టి.యు కాకినాడ సివిల్ ఇంజనీరింగ్ విభాగం వారి సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 7-7-2025 నుండి 11-7-2025 వరకు ఎమర్జింగ్ ట్రెండ్స్ ఇన్ సివిల్ ఇంజనీరింగ్ అండ్ రీసెర్చ్ ఛాలెంజస్ టవరడ్స్ సుస్తాయినాబిలిటీ అనే అంశం పై అధ్యాపక అభివృద్ధి శిక్షణా కార్యక్రమం ను నిర్వహించారు ఈ కార్యక్రమానికి ఐఐటీ -తిరుపతి నిట్ - వరంగల్ ,నిట్ - ఏ పి మరియు ప్రముఖ ప్రైవేట్ విశ్వ విద్యాలయాలైన విజ్ఞాన్ , ఎస్ ఆర్ ఎం, కె ఎల్ యూనివర్సిటీ ల కు చెందిన అనుభవిజ్ఞులైన ప్రొఫెసర్లు రిసోర్స్ పర్సన్స్ గా వ్యవహరించారు. వీరితో పాటు విజయవాడ లోని అల్ట్రా టెక్ సిమెంట్ కి చెందిన టెక్నికల్ మేనేజర్ శ్రీ రాజేష్ ఖన్నా , ఏపీ ట్రాన్స్కో విజయవాడ లోని సివిల్ ఇంజనీరింగ్ విభాగానికి చెందిన డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పి .ఏ.వి.గోవిందా రాజులు, హైదెరాబాద్ల ప్రముఖ సంస్ద ఇంజనీర్స్ స్టాఫ్ కాలేజీ ఆఫ్ ఇండియా లో సివిల్ ఇంజనీరింగ్ విభాగానికి చెందిన పి .శ్రీధర్ తమ అనుభవాలను ఈ కార్యక్రమంలో పంచుకున్నారు. ఈ శిక్షణా కార్యక్రమంలో నీటి పారుదల, నీటి సంరక్షణ , రహదారి నిర్మాణం, మరియు నిర్వహణ, కాంక్రీటు సాంకేతికతలోని ఆధునిక పద్ధతులు, కోల్ - ఫార్మడ్ స్టీల్ ఉపయోగించి పర్యావరణ హితమైన నిర్మాణాలు చేసే విధానాలు, నిర్మాణ రంగంలో పర్యావరణ హితంగా ఇనుమును ఉపయోగించుకొనే విధానాలు, సివిల్ ఇంజనీరింగ్ లో రిమోట్ సెన్సింగ్ మరియు గీస్ ఉపయోగాలు వంటి అనేక విషయాల గురించి వక్తలు సోదాహరణంగా వివరించారు. యల్.బి.ఆర్.సి.ఈ సివిల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి కె.వి.రమణ, మరియు జె.యన్.టి.యు కాకినాడ నుండి షేక్ షమీమ్ భాను కో ఆర్డినేటర్లు గా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో వివిధ కళాశాలల నుండి 40 మంది అధ్యాపకులు, పరిశోధనా విద్యార్థులు మరియు కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.



# ప్రపంచ జనాభా దినోత్సవం పై అవగాహనా సదస్సు

**మైలవరం జులై 11 మనం న్యూస్:** స్థానిక లకి రెడ్డి బాలి రెడ్డి ఇంజనీరింగ్ కాలేజీలో ప్రపంచ జనాభా దినోత్సవాన్ని కళాశాల యన్.యస్.యస్. యూనిట్ వారి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల వైస్ ప్రిన్సిపాల్ బి.రమేష్ రెడ్డి, మాట్లాడుతూ ప్రపంచా వ్యాప్తంగా జనాభాకు సంబంధించిన అంశాలపై అవగాహన పెంచడానికి ప్రతి సంవత్సరం జూలై 11న ప్రపంచ జనాభా దినోత్సవంను జరుపుకుంటరని, ప్రపంచ జనాభా దినోత్సవం ద్వారా, ఐక్యరాజ్యసమితి జనాభా సంబంధిత సవాళ్లను పరిష్కరించడం, స్థిరమైన అభివృద్ధిని ప్రోత్సహించడం యొక్క ప్రపంచ ప్రాముఖ్యతను హైలైట్ చేయాలని కోరుకుంటుందని, కాలక్రమేణా, ప్రపంచ జనాభా దినోత్సవం దృష్టి జనాభా వృద్ధి నుండి మాతృ ఆరోగ్యం, పిల్లల సంక్షేమం, కుటుంబ నియంత్రణ వంటి విస్తృత సమస్యల వైపు మళ్లిందని మానవ హక్కులు, ముఖ్యంగా పునరుత్పత్తి హక్కులు, ఎంపికల గురించి మాట్లాడటానికి ప్రపంచ జనాభా దినోత్సవం ఒక వేదికగా మారిందని అయన అన్నారు. యన్.యస్.యస్ ప్రోగ్రాం ఆఫీసర్ బి.శివహరి ప్రసాద్ మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో భాగంగా జనాభా వృద్ధి వనరులు, పర్యావరణంపై చూపే ప్రభావం గురించి, అలాగే పునరుత్పత్తి ఆరోగ్యం, కుటుంబ నియంత్రణ సేవలను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడాన్ని ప్రోత్సహించడం కూడా ఈ దినోత్సవ లక్ష్యాలలో ఒకటి, లైంగిక సమానత్వం, యువత సాధికారత, విద్య, ఆరోగ్య సంరక్షణకు సమాన ప్రాప్యత వంటి అనేక అంశాలపై విద్యార్థిని, విద్యార్థులకు అవగాహన కలిపించారు. ఈకార్యక్రమంలో డీన్స్, వివిధ విభాగాధిపతులు, మరియు అసిస్టెంట్ యన్.యస్.యస్. ప్రోగ్రాం ఆఫీసర్ ఎస్ .ఉమామహేశ్వర రెడ్డి, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.



# ఎస్సీ ఎస్టీ అత్యాచార నిరోదక చట్టాన్ని దుర్వినియోగం చేస్తుంటే చూస్తూ ఊరుకోం




**అవనిగడ్డ, జులై 11 (మనం న్యూస్) :** కులవివక్షత నిర్మూలన కోసం మహనీయిల త్యాగాలతో రాజ్యాంగ బద్ధంగా ఏర్పాటైన ఎస్సీ ఎస్టీ అత్యాచార నిరోధక చట్టాన్ని కొందరు తప్పు దారి పట్టించడం సోచనీయమని కృష్ణాజిల్లా మాల మహానాడు అధ్యక్షులు దోవా గోవర్ధన్ అన్నారు. ఎస్సీ ఎస్టీ కులాలపై ఓసి కులస్థులు ప్రేమ చూపించడం హర్షించదగ్గ విషయమేనని కానీ, ఆ ప్రేమ వెనుక వారి అక్రమ వ్యాపార లావాదేవీలు వాటి ప్రయోజనాలు దాగి ఉండటం క్షమించరాని నేరంగా పరిగణించాలని అన్నారు. ఇది అట్రాసిటీ యాక్ట్ పరిధిలోని వస్తుందని ఈ విషయంలో సదరు పోలీసు డిపార్ట్మెంట్ వారు తగిన విచారణ జరపాలని గోవర్ధన్ డిమాండ్ చేసారు. ఇటీవల కోడూరులో జరిగిన ఒక రోడ్డు ప్రమాదాన్ని కొందరు ఓసి రాజకీయ నేతలు వారి స్వార్థం కోసం అట్రాసిటీ కేసుగా చిత్రీకరించడానికి అనేక మార్గాలను అనుసరించారని, ఈ కేసులో ఓ ప్రభుత్వ ఉద్యోగిని ఉద్దేశ పూర్వకంగా ఇరికించడానికి, తద్వారా వారి వ్యాపార ప్రయోజనాలు సర్దుబాటు చేసుకోవడం కోసం ఓ యువకుడ్ని పావుగా వాడుకోవడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఎస్సీ ఎస్టీలపై కులపరమైన వేధింపులు, సాంఘిక, ఆర్థికపరమైన దాడులు జరిగితే ఆ విషయంలో స్పందించడానికి అనేక దళిత సంఘాలు పనిచేస్తున్నాయని గుర్తుచేసారు. ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని ఇతరుల స్వార్థం కోసం వినియోగించుకోవాలని చూస్తే వారి పైన అదే కేసు పెట్టడానికి కూడా వెనకాడబోమని గోవర్ధన్ హెచ్చరించారు.

# గొల్లపూడిలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం

- మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వర రావు



**విజయవాడ రూరల్, జూలై 11 (మనం న్యూస్):** ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం సమర్థవంతంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తూ ప్రజల సంతోషాన్ని చూరగొంటున్న వేళ, వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్ రెడ్డి అశాంతి, అలజడులు సృష్టించేందుకు పరామర్శల పేరుతో కుయుక్తులు పన్నుతున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వర రావు పేర్కొన్నారు. కూటమి సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఎన్టీఆర్ జిల్లా, విజయవాడ రూరల్ మండలం గొల్లపూడి గ్రామంలోని వస్త్రలత కాలనీ మరియు త్రిబుల్ ఎస్ కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా పెద్దింటి దాసమ్మ, గొర్లె ప్రశాంతం కుమార్ కుటుంబాలను కలిసి, కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతు, రాష్ట్రంలో పెట్టుబడులు ఆకర్షించేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తుంటే, జగన్ తన వ్యూహకర్తలతో కలిసి 200 పారిశ్రామికవేత్తలకు మెయిల్స్ పంపించి పెట్టుబడులు రాకుండా అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపంచారు. ఈ చర్యలను ప్రజలు గమనిస్తూ, జగన్ చిల్లర మనస్తత్వంతో నిత్యం గొడవలు సృష్టిస్తున్నారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో ప్రజలకు సంతోషాన్ని అందిస్తూ, దేశంలో ఎక్కడా లేని విధంగా 'తల్లికి వందనం' వంటి సంక్షేమ పథకాలను అమలు చేస్తోంది. అయితే, గత ఐదేళ్లలో విధ్వంసం సృష్టించిన వైసీపీ, మళ్లీ కుట్రలు పన్నుతూ రాష్ట్ర పురోగతిని అడ్డుకోవడానికి ప్రయత్నిస్తోందని, దీనిపై జగన్ వ్యూహకర్తలను అరెస్ట్ చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. 2024 ఎన్నికల్లో కేవలం 11 సీట్లకు పరిమితమైనా జగన్ రెడ్డి బుద్ధి మార్చుకోలేదని, ఆయన అశాంతి సృష్టించే ప్రయత్నాలను తీవ్రంగా ఖండించారు. గొల్లపూడి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో జరిగిన పీటీఎం 2.0 కార్యక్రమంలో పాల్గొని, పాఠశాలకు 10 వేల రూపాయల విరాళాన్ని అందజేసిన విషయం ఈ సందర్భంగా గుర్తు చేసారు. కూటమి ప్రభుత్వం ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పాలన సాగిస్తుండగా, జగన్ రెడ్డి రాష్ట్ర ప్రగతిని అడ్డుకునేందుకు చేస్తున్న కుట్రలను ప్రజలు గమనిస్తున్నారని, వైసీపీ రాజకీయ హీనతను ఎండగడుతున్నారని దేవినేని ఉమా మహేశ్వర రావు అన్నారు. రాష్ట్రం సమగ్ర అభివృద్ధి దిశగా పయనిస్తుండగా, కూటమి ప్రభుత్వం ప్రజలకు మరింత సంక్షేమం, సంతోషం అందించేందుకు కట్టుబడి ఉందని ఆయన స్పష్టం చేశారు.

# కామ్రేడ్ యార్లగడ్డ సోమయ్యకు పలువురు నివాళులు




**చల్లపల్లి, జులై 11 (మనం న్యూస్) :** చల్లపల్లి మండల పరిధిలోని కొత్త మాజేరు గ్రామానికి చెందిన సిపిఎం పార్టీ సీనియర్ సభ్యులు యార్లగడ్డ సోమయ్య(85) గురువారం మరణించారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. సోమయ్య ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీలో సభ్యుడిగా కొనసాగుతూ, పార్టీ విభజనానంతరం సిపిఎం పార్టీ సభ్యుడుగా తుది శ్వాస వరకు నడిచారు. చల్లపల్లి జమిందార్ మిగుల భూముల పంపిణీ పోరాటంలో కామ్రేడ్ చండ్ర రాజేశ్వరరావు, కామ్రేడ్ గుంటూరు బాపనయ్యలతో కలిసి పాల్గొన్నారు. పంచాయతీ పరిధిలోని పాత మాజేరు, పచ్చార్లంక గ్రామంలో పేదల గృహ నిర్మాణానికి మాజీ ఎమ్మెల్యే పాటూరు రామయ్యతో కలిపి కృషి చేశారు. కొత్త మాజేరు లో కృష్ణా కో-ఆపరేటివ్ బ్యాంక్ డైరెక్టర్ గా, పంచాయతీ వార్డు నంబర్ గా ఆయన పనిచేశారు చేశారు. సిపిఎం పార్టీ సిద్ధాంతాలను ఆచరిస్తూ గ్రామంలో పార్టీ అభివృద్ధికి సోమయ్య కృషి చేశారు. కామ్రేడ్ సోమయ్య పార్థివ దేహాన్ని మండల సిపిఎం పార్టీ కార్యదర్శి యద్దనపూడి మధు, సీనియర్ నాయకులు వాకా రామచంద్రరావు, మహమ్మద్ కరీముల్లా, గోళ్ల సాంబశివరావు లు సందర్శించి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపి, సంతాపం ప్రకటించారు. కామ్రేడ్ యార్లగడ్డ సోమయ్య మృతి పట్ల సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి సభ్యులు శీలం నారాయణరావు సంతాపం తెలియజేసి కుటుంబానికి సానుభూతి ప్రకటించారు. ఆయన అంతిమయాత్రలో గ్రామ సర్పంచ్ లక్ష్మీ నాంచారమ్మ, గ్రామ ప్రముఖులు కల్లేపల్లి లక్ష్మీనారాయణ, పిఎసిఎస్ సీఈవో చక్రపాణి, గ్రామస్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

# వీరులపాడు తహసీల్దార్‌గా పాలపర్తి రవికుమార్ బాధ్యతలు స్వీకరణ



**వీరులపాడు, జూలై 11(మనం న్యూస్):** వీరులపాడు మండల నూతన తాసిల్దారుగా నిన్న బాధ్యతలు స్వీకరించిన పాలపర్తి రవికుమార్ ని వీరులపాడు ప్రెస్ క్లబ్అసోసియేషన్ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ప్రెస్ క్లబ్ సభ్యులు అందరూ తాసిల్దారు రవికుమార్ను శాలువాతో సత్కరించారు తాసిల్దార్ రవికుమార్ మాట్లాడుతూ, ప్రజలకు భూ సమస్యలు ఏమైనా ఉంటే తన దృష్టికి తీసుకురావాలని కోరారు ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారుఈ కార్యక్రమంలో వీరులపాడు ప్రెస్ క్లబ్ అధ్యక్షులు గోపిశెట్టి వరప్రసాద్, ఉపాధ్యక్షులు ఆంధ్రజ్యోతి విలేకరి ప్రత్తిపాటి శ్రీనివాసరావు, గౌరవ అధ్యక్షులు షేక్ గౌస్, కోశాధికారి యర్రంరెడ్డి ప్రదీప్ కుమార్, ఈనాడు విలేకరి ఉదయభాస్కర్, చిన్న గౌస్, గోపాలకృష్ణ , మనం న్యూస్ రిపోర్టర్ వెంకటేశ్వరరావు మరియు ఇతర దినపత్రికల విలేకరులు పాల్గొన్నారు.

# ఘంటసాలలో ప్రపంచ జనాభా దినోత్సవ ర్యాలీ




**ఘంటసాల, జులై 11 (మనం న్యూస్) :** ఘంటసాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ప్రపంచ జనాభా దినోత్సవ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు డాక్టర్ వేమూరి ప్రమోద్ కుమార్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అంతర్జాతీయ జనాభా దినోత్సవం లేదా ప్రపంచ జనాభా దినోత్సవం ప్రతి ఏటా జూలై 11 వ తేదీన నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పర్యావరణం, అభివృద్ధికి, జనాభా సమస్యలపై అవగాహన పెంచడానికి ప్రపంచ జనాభా దినోత్సవాన్ని కొనసాగించాలని 1987లో ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ నిర్ణయించిందన్నారు. ఆరోగ్యవంతమైన జీవన విధానం ద్వారా జనాభా పెరుగుతుందని తెలిపారు. ప్రజా శ్రేయస్సుకు ప్రభుత్వాలు ఎంతగానో కృషి చేస్తున్నట్టు వివరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వెంకటేశ్వరరావు, హెల్త్ సూపర్వైజర్లు శివకృష్ణ, పూర్ణచంద్రరావు, హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాసరావు, స్టాఫ్ నర్సు సుజాత, ఫార్మసీ ఆఫీసర్ కృష్ణ, ఏఎన్ఎం మార్తమ్మ తదితరులు పాల్గొన్నారు. తొలుత గ్రామంలో ప్రజలకు జనాభా దినోత్సవం గురించి అవగాహన కల్పిస్తూ ర్యాలీని నిర్వహించారు.

# మినరల్ వాటర్ ప్లాంట్ యజమానులు నాణ్యతా ప్రమాణాలను పాటించాలి

- జిల్లా పోరేసిన్ అధికారి బద్రీనాథ్




**వీరులపాడు, జులై 11(మనం న్యూస్):** మండలంలో జుజ్జూరు గ్రామంలో మినరల్ వాటర్ సప్లై కేంద్రాలను స్థానిక వైద్య అధికారులతో కలిసి జిల్లా పోరాసిన్ అధికారి బద్రీనాథ్ తనిఖీ చేసి పరిశీలించారు మినరల్ వాటర్ ప్లాంట్ యజమానులతో మినరల్ వాటర్ తయారీ విధానాన్ని తెలుసుకొని వాటర్ ప్లాంట్లు టీడీఎస్ పీహెచ్ నార్మల్ రేంజ్ లో మెయింటినెన్స్ చేయాలి తెలిపారు ప్రతిరోజు బ్లాక్ వాష్ చేయాలని తరచూ ఫిల్టర్ కొత్తవి అమర్చకోవాలని పరిసరభంగా వినియోగదారులకు నాణ్యమైన తాగునీరు అందించేటట్లు ఏర్పాటు చేసుకోవాలని కోరారు గ్రామంలో ఉన్న రెండు వాటర్ ప్లాంట్ ను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు గ్రామ ప్రజలకు బోరు వాటర్ గాని కుంటలు వాటర్ తాగకుండా అవగాహన కల్పించాలని కోరారు బోరు కుంటలు నీటిని తాగడం వల్ల ప్రజల అనారోగ్యానికి గురవుతున్నారని తెలిపారు. గ్రామంలో కొన్ని కుటుంబాలను ఇంటింటికీ వెళ్లి వారి ఆరోగ్య పరిస్థితిలో అడిగి తెలుసుకున్నారు ఎవరైనా అనారోగ్యాన్ని గురైతే వెంటనే స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సమాచారం తెలియజేయాలి వెంటనే సిబ్బంది తమ ఇంటి దగ్గరికి వచ్చి వైద్య సేవలు అందించడం జరుగుతుందని తెలిపారు ప్రస్తుతం వర్షాకాలం అవటంతో దోమలు విపరీతంగా పెరిగే అవకాశాలు ఉన్నాయని ప్రతి ఒక్కరు తమ ఇంట్లో ఉన్న నిల్వ నీటిని నిలవ లేకుండా చర్యలు తీసుకోవాలని కోరారు వాటర్ ప్లాంట్ యజమానులతో ఆయన మాట్లాడుతూ ప్రజలకు తాగునీరు అందించడంలో కీలక బాధ్యతలు నిర్వహిస్తున్నందుకు వారికి అభినందనలు తెలిపారు వాటర్ యజమానులు జిల్లా అధికారితో వారికున్న సమస్యలు వారి దృష్టికి తీసుకెళ్లారు కరెంటు చార్జీలు సర్వీస్ ఛార్జీల పేరుతో పెద్ద ఎత్తున వసూలుకు పాల్పడుతున్నారని కరెంటు చార్జీలు కూడా సరిపడే నిధులు రావటం లేదని ఆయన దృష్టికి తీసుకెళ్లారు వాటర్ ప్లాంట్ యజమానులకు కరెంటు చార్జీల పై రాయితీ కల్పించాలని జిల్లా ఫోరేషన్ అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారం చేపడతామని చెప్పారు. గ్రామంలో ఉన్న మండల ప్రజా పాఠశాల విద్యార్థులు దంతాలు ను పరిశీలించారు విద్యార్థులు జాగ్రత్తలు తీసుకొవాలని ఉపాధ్యాయులతో పాటు వారి తల్లిదండ్రులకు తెలియజేశారు ఈ కార్యక్రమంలో పీహెచ్ ఇ అధికారి రవికిరణ్ రెడ్డి ఎం పి హెచ్ ఈ ఓ చంద్రశేఖర్ ఎం పి హెచ్ ఎస్ మూర్తి కృపారాణి ఏఎన్ఎం జ్యోతి రాణి మరియు వైద్య సిబ్బంది ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు

# విద్యార్థుల నీటి కొరత తీర్చేందుకు మోటార్ బహూకరించిన హనుమాన్ జంక్షన్ మానవత




**హనుమాన్ జంక్షన్, జూలై 11(మనంన్యూస్):** పెదపాడు మండలం ఏపూరు గ్రామములోని రెగ్యులర్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు నీటి కొరత తీర్చుటకు ఉపాధ్యాయుల కోరిక మేరకు పాఠశాలకు 9,000 రూపాయల విలువగల మోటార్ ను శుక్రవారం ప్రధాన ఉపాధ్యాయుడు శ్రీనివాస్ కి అందించారు. ఈ కార్యక్రమంలో జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత , మానవత స్వచ్ఛంద సేవా సంస్థ రాష్ట్ర కన్వీనర్ మారుబోయిన కోటేశ్వరరావు, బాణాల నరసింహారావు, పాబోలు గణేష్ బాబు, ఘంటా సత్యన్నారాయణ, గూడపాటి జయరామచంద్రరావు, చెక్కా సుబ్బారావు, కొట్నాని రామ చంద్రరావు, ఘంటా ఇందిరా దేవి, పి వి చలం, కూరెళ్ళ సుబ్బాచారి, బెజవాడ శ్రీరామమూర్తి తదితరులు పాల్గొన్నారు.

# హాస్టళ్లపై ఆకస్మిక తనిఖీ చేస్తాం.. ఆలసత్వం వద్దు

మొదటి పేజీ తరువాయి




ప్రభుత్వ సంక్షేమ వసతి గృహ విద్యార్థులకు సంక్షేమ అధికారులు తల్లిదండ్రులతో సమానమని విద్యార్థులు మెరుగైన విద్యను అభ్యసించడంతో పాటు సంపూర్ణ ఆరోగ్యం క్రమశిక్షణతో ఉన్నత చదువులు చదివేలా సంక్షేమ అధికారులు కృషి చేసినప్పుడు విద్యార్థి జీవితాంతం గుర్తించుకుంటారని సంక్షేమ అధికారులు జీవితంలో మధురానిభూతి పొందగలుగుతారని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ అన్నారు. జిల్లాలోని సాంఘిక సంక్షేమ, వెనుకబడిన తరగతులు, గిరిజన సంక్షేమ, గురుకుల వసతి గృహాల నిర్వహణపై ఆయా శాఖల జిల్లా అధికారులు, సహాయ సంక్షేమ అధికారులు, వసతి గృహ సంక్షేమ అధికారులతో ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ శుక్రవారం కలెక్టరేట్లోని పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 34 సాంఘీక సంక్షేమ వసతి గృహలలో 2218 మంది, 26 వెనుకబడిన తరగతుల సంక్షేమ వసతి గృహలలో 1259 మంది, 3 వెనుకబడిన తరగుతుల సంక్షేమ వసతి గృహాలలో 341 మంది,2 మైనార్టీ సంక్షేమ వసతి గృహలలో 64 మంది విద్యార్థులు ప్రస్తుతం విద్యను అభ్యసిస్తున్నారన్నారు. వసతి గృహలలో వందలాది మంది పేద విద్యార్థుల భవిష్యత్ వసతి గృహ సంక్షేమ అధికారులపై ఆదారిపడి ఉంటుందన్నారు. సంక్షేమ అధికారులు అత్యంత భాధ్యతతో విద్య ఆరోగ్యం క్రమశిక్షణ వంటి విషయాలపై ప్రత్యేక శ్రద్ద పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యంగా వసతి గృహ నిర్వహణలో పచ్చదనం, పరిశుభ్రత, పారిశుద్యానికి అత్యంత ప్రాదాన్యతనిచ్చి నిర్వహించినప్పుడు విద్యార్థులలో మానసిక ఉల్లాసం పెరిగి ఆరోగ్యంతో పాటు మెరుగైన విద్యను అభ్యసించేందుకు ఎంతో దోహదపడుతుందన్నారు. విద్యార్థులకు వసతి గృహాలలో కిచెన్ షెడ్ల నిర్వహణను నిశితంగా పరిశీలించాలని ప్రతి వసతి గృహంలోను ఎటిఎం  కిచెన్ గార్డెన్ను నిర్వహించాలన్నారు. వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని వసతి గృహల పరిసరాలలో నీటి నిల్వలు లేకుండా చర్యలు తీసుకోవాలని దోమ తెరలను తప్పక ఏర్పాటు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. విద్యార్థులకు ఎప్పటికప్పుడు ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలని ఇందుకు మెడికల్ అధికారులు తప్పనిసరిగా హాజరు అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థులకు తాగునీటిని సరఫరా చేసే ఆర్వో ప్లాంట్లు, ఓవర్ హెడ్ ట్యాంకు లను ఎప్పటికప్పుడు శుభ్రపరచి ట్యాంకులపై మూతలు ఏర్పాటు చేయాలన్నారు. వసతి గృహల నిర్వహణలో ఎటువంటి ఇబ్బందులు ఎదురైనా అధికారుల దృష్టికి తీసుకురావాలని, హాస్టల్ మరమత్తులకు సంబంధించి తగు ప్రతిపాదనలు సమర్పించాలన్నారు. హాస్టల్ ప్రాంగణంలో ఉపాధి హామి పథకం ద్వారా కంపోట్స్ పిట్స్, సోక్పిట్స్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని రెండు ఎకరాలకు పై బడి స్థలం గల వసతి గృహలలో ఫాంపాండ్స్ ఏర్పాటు చేస్తామన్నారు. విద్యార్థులకు గ్రీన్ పాస్పోర్టు ద్వారా మొక్కలు నాటి సంరక్షించే  భాధ్యతను అప్పగించాలన్నారు. అగ్రికనెక్ట్ ద్వారా హాస్టల్ విద్యార్థులను వారానికి ఒక రోజు వ్యవసాయ క్షేత్రాలను సందర్శించి రైతులతో ముఖాముఖి జరిపేలా చర్యలు తీసుకోవాలన్నారు. క్యాలండర్ ఇయర్లో ప్రతి రోజుకు ఒక ప్రత్యేక గుర్తింపు ఉంటుందని వాటిని గుర్తించి అదే రోజు విద్యార్థులకు ప్రాముఖ్యతను వివరించి ప్రరిజ్ఞానాన్ని పెంపొందించాలన్నారు.  విద్యార్థులను కనబిడ్డలవలే భావించి  వసతి గృహ సంక్షేమ అధికారి ప్రతి రోజు తప్పక విద్యార్థులతో కలిసి భోజనం చేయాలని పిల్లల పట్ల మక్కువతో ప్రేమను పంచుతూ క్రమశిక్షణను నేర్పించాలన్నారు. విద్యార్థులు మాదక ద్రవ్యాలు, మత్తుపదార్థాలు, చెడు అలావాట్ల దరికి చేరకుండా అప్రమత్తతతో నిరంతరం ప్రర్యవేక్షించాలన్నారు. పి4 పథకం కింద మార్గ దర్శకాల సహకారంతో సంక్షేమ వసతి గృహలు, విద్యార్థులను దత్తత తీసుకుని ఆణిముత్యాలవంటి విద్యార్థులుగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలన్నారు. వసతి గృహాలను ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తామని.. ఆలసత్వం వహిస్తే సహించబోనని... నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టి మంచి ఫలితాలను సాధించే అధికారులను మనస్పూర్తిగా అభినందిస్తానని జిల్లా కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు.

## రాజీవ్ గాంధీ పూల మార్కెట్ కూరగాయల మార్కెట్ తరలింపు నకు పరిశీలన



- **విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర**

**విజయవాడ సెంట్రల్, జూలై 11 (మనం న్యూస్):** విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర శుక్రవారం ఉదయం తన పర్యటనలో భాగంగా అజిత్ సింగ్ నగర్, ఎక్సెల్ ప్లాంట్ నందు పర్యటించి వన్ టౌన్ రాజీవ్ గాంధీ కూరగాయల మార్కెట్ పూల మార్కెట్, కూరగాయల ను తరలించేందుకు ఎక్సెల్ ప్లాంట్ వద్ద గల స్థలాన్ని పరిశీలించారు. సౌత్ సెంట్రల్ రైల్వే స్థలంలో ఉన్న విజయవాడ వన్ టౌన్ రాజీవ్ గాంధీ పూల మార్కెట్, కూరగాయల మార్కెట్ ను అజిత్ సింగ్ నగర్ ఎక్సెల్ ప్లాంట్ వద్ద ఉన్న ఖాళీ స్థలంలో తరలించేందుకు గల అవకాశాలు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ పర్యటనలో చీఫ్ ఇంజనీర్  ఆర్ శ్రీనాథ్ రెడ్డి,  చీఫ్ సిటీ ప్లానర్ సంజయ్ రత్నకుమార్, పర్యవేక్షణ ఇంజనీర్ పి సత్యకుమారి,  ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీనివాస్, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ బాబు శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

# మినరల్ ప్యూరిఫై వాటర్ ట్యాంక్ ను ప్రారంభించిన ఎమ్మెల్యే బొండా ఉమా




**విజయవాడ సెంట్రల్, జూలై 11 (మనం న్యూస్ )** శుక్రవారం ఉదయం సెంట్రల్ నియోజకవర్గంలోని 62వ డివిజన్ ఎల్ బిఎస్ నగర్, పుచ్చలపల్లి సుందరయ్య హై స్కూల్ , కోస్టల్ బ్యాంక్ గాయత్రి నగర్ కోఆర్డినేటర్ రాధా కుమారి చైల్ వెల్ఫేర్ కమిటీ వారి సహకారంతో రు.3లక్షల రూపాయల వ్యయంతో మినరల్ ప్యూరిఫై వాటర్ 1000 లీటర్ల సామర్థ్యం కలిగిన వాటర్ ట్యాంక్ ను విద్యార్థులకు ప్రభుత్వ విప్, సెంట్రల్ నియోజకవర్గ శాసనసభ్యులు బొండా ఉమామహేశ్వరరావు  చేతుల మీదుగా ప్రారంభించి అందించడం జరిగింది. ఈ సందర్భంగా బొండా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ కోస్టల్ బ్యాంక్ వారు ముందుకు వచ్చి చదువుకునే విద్యార్థులకు స్కూల్లో ఇటువంటి మంచి కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం చాలా సంతోషదాయకమని, ప్రభుత్వ పాఠశాలలలో  సిఎస్ ఆర్ నిధులతో వాటర్ ప్లాంటు ఏర్పాటు చేసినట్టే, ఇతర బ్యాంకులు, ఇండస్ట్రీస్ కూడా ముందుకు వచ్చి ఇటువంటి సేవా కార్యక్రమాలు చేపట్టాలని. ఒక పక్కన ప్రభుత్వంతో పాటు ప్రైవేట్ యాజమాన్యం కూడా ముందుకు వచ్చి సేవా కార్యక్రమాలు చేపట్టడం ద్వారా ప్రజలకు, విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది అని, చదువు మన బిడ్డల భవిష్యత్తును వెలుగుపరచే దీపంలా మారాలనే లక్ష్యంతో చంద్రబాబు తీసుకుంటున్న స్వర్ణాంధ్ర విజన్ 2047 పథకం ఎంతో దిశానిర్దేశకంగా ఉంది అని, ముఖ్యంగా విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ చిత్తశుద్ధి, ప్రతిభ, యువతపై ఉన్న నమ్మకం రాష్ట్రం మొత్తం గర్వపడే విధంగా పనిచేస్తున్నాయి అని, ఆయన ప్రోత్సాహంతో పాఠశాలలకు ఆధునిక సదుపాయాలు, డిజిటల్ తరగతులు, మోడల్ ల్యాబ్లు, ఇంటర్నేషనల్ స్టాండర్డ్ వసతులు అందుతున్నాయి అని అన్నారు. గత ప్రభుత్వంలో అమ్మఒడి ఇంటిలో ఎంతమంది ఉన్నా ఒకరికి మాత్రమే పడేదని, ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఇంటిలో ఎంతమంది చదువుకునే పిల్లలు ఉన్న అందరికీ తల్లికి వందనం అందజేశాం అని తెలియజేసారు. ఈ కార్యక్రమం లో అడ్వకేట్ చైల్ వెల్ఫేర్ కమిటీ టి. రామకృష్ణ, కోస్టల్ బ్యాంక్ రీజనల్ మేనేజర్ పి. శ్రీనివాస్ కుమార్, అడ్వకేట్ హాజ్రత గుప్తా, మాజీ కార్పొరేటర్ పైడి తులసి, డివిజన్ అధ్యక్షులు జలకం రాజా, ఇంచార్జి పైడి శ్రీను, మరియ బాబు, బత్తుల కొండా తదితరులు పాల్గొన్నారు.

## నేడు విజయవాడ ప్రెస్ క్లబ్ లో జర్నలిస్టులకు ఉచిత క్యాన్సర్ నిర్ధారణ శిబిరం



**విజయవాడ సెంట్రల్, జూలై 11 (మనం న్యూస్ )** బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్, రీసెర్చ్ ఇన్స్టిట్యూట్, విజయవాడ ప్రెస్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 3 గంటల వరకు విజయవాడ గాంధీనగర్ లోని ప్రెస్ క్లబ్ లో ఉచిత క్యాన్సర్ నిర్ధారణ శిబిరం ఏర్పాటు చేయనున్నట్లు విజయవాడ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు కంచల జయరాజ్ శుక్రవారం నాడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరంలో దాదాపు 8 వేల రూపాయల విలువైన మెమోగ్రఫీ, గర్భాశయా స్కానింగ్, పాప్స్ మియర్, ఊపిరితిత్తుల క్యాన్సర్ వంటి పరీక్షలను ఉచితంగా చేస్తారని తెలిపారు. వెంటనే రిపోర్టులు కూడా అందజేస్తారని అన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ ఎమ్మెల్యే బోండా ఉమామహేశ్వరరావు హాజరై శిబిరాన్ని ప్రారంభిస్తారని తెలియజేశారు. ఎంతో విలువైన ఈ శిబిరంలో విజయవాడ నగరంతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల్లో పని చేసే ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాకు చెందిన జర్నలిస్టులు, నాన్ జర్నలిస్టులు, వారి కుటుంబ సభ్యులందరూ సద్వినియోగం చేసుకోవలసిందిగా కోరారు.

## అఖిల భారత బీసీ సంక్షేమ సంఘం అధ్వర్యంలో చలో ఢిల్లీ పోస్టర్ ఆవిష్కరణ

**విజయవాడ సెంట్రల్, జూలై 11 (మనం న్యూస్ ):** అఖిల భారత బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు డాక్టర్ లగుడు గోవిందరావు విజయవాడ ప్రెస్ క్లబ్ లో చలో ఢిల్లీ పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 50 శాతం ఉన్న బిసీలకు దశాబ్దాలుగా అన్యాయం జరుగుతూనే ఉందన్నారు. బిసి సామాజిక వర్గాలకు జనాభా ప్రాతిపదికన సామాజిక, రాజకీయ, ఆర్థిక రంగాల్లో అన్యాయం జరుగుతుందన్నారు .ఈ నేపద్యంలో ఈ నెల21న ఢిల్లీ వేదికగా జరగబోయే పార్లమెంట్ సమావేశాల్లో బిసి సామాజిక వర్గానికి జనగణనతో పాటు కుల గణన కూడా చేపట్టాలని, బిసి సామాజిక వర్గాలకు చట్ట సభలలో 50 శాతం రిజర్వేషన్ కల్పించాలని, కేంద్రంలో బిసిలకు ప్రత్యేక బిసి మంత్రిత్య శాఖను కేటాయించాలని, బిసిలపైన జరుగుతున్న దాడుల నేపద్యంలో బిసి రక్షణ చట్టం ఏర్పాటు చేయాలని, బిపి మండల్ కమీషన్ సిఫార్సులను అమలు పరచాలనే డిమాండ్లతో పాటు పలు డిమాండ్ల సాధన కోసం ఈ నెల 20న చలో డిల్లీ కార్యక్రమాన్ని చేపడుతున్నామన్నారు. బిసిలందరూ ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆయన కోరారు.




## ఆంధ్రజ్యోతి ఫోటోగ్రాఫర్ శివ కుమార్‌పై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలి

- **విజయవాడ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు కంచల జయరాజ్**




**విజయవాడ సెంట్రల్, జూలై 11 (మనం న్యూస్):** విధి నిర్వహణలో ఉన్న ఆంధ్రజ్యోతి చిత్తూరు డిప్యూటీ చీఫ్ ఫోటోగ్రాఫర్ శివ కుమ్వాన దాడికి పాల్పడిన వారిని తక్షణమే కఠినంగా శిక్షించాలని కృష్ణా అర్బన్ ఎపియు డబ్ల్యు జె ,విజయవాడ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు కంచల జయరాజ్ డిమాండ్ చేశారు. అందుకు నిరసనగా వారు శుక్రవారం నాడు విజయవాడలోని కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు కంచల జయరాజ్ మాట్లాడుతూ బంగారుపాలెం జగన్ పర్యటనలో వైసీపీ కార్యకర్తలు దౌర్జన్యానికి దిగారని అన్నారు. జగన్ అక్కడి రైతులతో మాట్లాడే ఫొటోలను తీస్తున్న ఆంధ్రజ్యోతి చిత్తూరు డిప్యూటీ చీఫ్ ఫోటోగ్రాఫర్ శివ కుమ్వా విచక్షణా రహితంగా దాడి చేశారని తెలిపారు. సుమారు పది మంది చుట్టు ముట్టి అతడి చొక్కా చించేసి మరీ విచక్షణారహితంగా కొట్టడం అమనుషమన్నారు. ఉదయం నుంచి తీసిన ప్రోగ్రాం ఫోటోలు ఉండే మెమరీ కార్డు లాక్కున్నారనీ అన్నారు.  మాజీ డిప్యూటీ సీఎం నారాయణ స్వామి సైగ చేయడంతో దాడులకు తెగబడ్డారని స్పష్టం చేశారు. చిత్తూరు వైసీపీ ఇంచార్జి విజయానంద రెడ్డి చూస్తుండగానే ఈ దాడి జరిగిందన్నారు. మెమరీ కార్డును.. విజయానంద రెడ్డి అనుచరుడు చక్రి తీసుకున్నారని అన్నారు. తక్షణమే దాడి చచేసిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

# విజయవాడను సిటీ ఆఫ్ విక్టరీగా తీర్చిదిద్దేందుకు మీడియా పాత్ర కీలకం

- **ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్. జి.లక్ష్మీశ**

**విజయవాడ సెంట్రల్, జూలై 11( మనం న్యూస్):** రాష్ట్ర నవ్య రాజధాని అమరావతికి గేట్ వే అయిన విజయవాడను సిటీ ఆఫ్ విక్టరీగా తీర్చిదిద్దేందుకు, ఎన్టీఆర్ జిల్లా సమగ్రాభివృద్ధిలో మీడియా పాత్ర కీలకమని, యోగాంధ్ర వంటి వివిధ అంశాలపై ప్రజల్లో చైతన్యం తేవడంలో మీడియా చేస్తున్న కృషి అనిర్వచనీయమని జిల్లా కలెక్టర్ డాక్టర్. జి.లక్ష్మీశ అన్నారు. యోగాంధ్ర విజయవంతం నేపథ్యంలో శుక్రవారం నగరంలోని గురునానక్ కాలనీ శుభలగ్నం వేదికలో జరిగిన మీడియా ప్రతినిధుల ఆత్మీయ సమావేశంలో కలెక్టర్ లక్ష్మీశ పాల్గొని మాట్లాడుతూ ఆరోగ్య ఆంధ్ర.. స్వర్ణాంధ్ర లక్ష్యాల సాధన దిశగా గౌరవ ముఖ్యమంత్రి దార్శనికతతో రాష్ట్ర ప్రభుత్వం ఆవిష్కరించిన యోగాంధ్ర విజయవంతానికి మీడియా విశేష కృషిచేసిందని.. వైబ్రెంట్ విజయవాడతో పాటు జిల్లా అన్ని రంగాల్లోనూ అభివృద్ధి సాధించేందుకు ఇదేవిధమైన చేయూత నందించాలని పేర్కొన్నారు. మీడియా వార్తలు, కథనాలతో ప్రజల్లో యోగా ఔన్నత్యంపై మంచి అవగాహన ఏర్పడిందని, యోగాంధ్ర కార్యక్రమ రూపకల్పన ఉద్దేశాలు, లక్ష్యాలు ప్రజలకు చేరువచేసేందుకు దోహదం చేశాయన్నారు. జిల్లాలో పర్యాటక రంగ అభివృద్ధికి అపార అవకాశాలున్న నేపథ్యంలో కొత్త టూరిజం సర్క్యూట్లపై దృష్టిపెడుతున్నామని, టెంపుల్ టూరిజం, ఎకో టూరిజం అభివృద్ధికి దార్శనిక ప్రణాళికలు రూపొందించామని వివరించారు. మూలపాడు బటర్ఫ్లై పార్క్- జీవవైవిధ్య పార్కు, బుద్ధిస్ట్ సర్క్యూట్, కొండపల్లి బొమ్మల ఎక్స్పీరియన్స్ సెంటర్ తదితరాలకు కృషిచేస్తున్నట్లు వివరించారు. ఫ్లోటింగ్ యోగా, త్రికోణ ఆసనాల్లో ప్రపంచ రికార్డులు సాధించిన టీమ్ ఎన్టీఆర్ సారథి, కలెక్టర్ డా. జి.లక్ష్మీశను జర్నలిస్టులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో డీఐపీఆర్వో కేవీ రమణరావు, డీపీఆర్వో ఎస్.మోహనరావు, డివిజనల్ పీఆర్వో కె.రవి, పబ్లిసిటీ సూపర్వైజర్ వీవీ ప్రసాద్, వివిధ మీడియా సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.



# రాష్ట్రంలో నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు

- **గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు**

**విజయవాడ రూరల్, జూలై 11 (మనం న్యూస్):** రాష్ట్రంలోని నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు తమ ప్రభుత్వం కృషి చేస్తుందని ప్రభుత్వ విప్ గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు తెలిపారు. విజయవాడ రూరల్ మండలం నున్న గ్రామంలో గురువారం సాయంత్రం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన యార్లగడ్డ ఇంటింటికి తిరుగుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకోవటంతో పాటు సంక్షేమ పథకాల అమలు తీరును లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా యార్లగడ్డ మాట్లాడుతూ తమ ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా 16,347 పోస్టులతో డీఎస్సీ నోటిఫికేషన్ ఇవ్వడంతో పాటు పోలీస్ శాఖలను నియమకాలు చేపట్టినట్లు చెప్పారు. అంతే కాకుండా పారిశ్రామిక రంగంలో ఎనిమిదిన్నర లక్షల ఉద్యోగాల కల్పనకు ఒప్పందాలు చేసుకున్నట్లు వివరించారు. రాష్ట్రంలో నిరుద్యోగ సమస్యను పరిష్కరించేందుకు తమ ప్రభుత్వం పారిశ్రామిక అభివృద్ధిపై దృష్టి సారించిందని ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర అభివృద్ధి కోసం 70 సంవత్సరాలు వయసులో కష్టపడుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు ప్రజలందరూ సంఘీభావం తెలపాలని ఆయన పిలుపునిచ్చారు. గన్నవరం నియోజకవర్గ అభివృద్ధి ధ్యేయంగా ప్రజాక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు యార్లగడ్డ పేర్కొన్నారు. సమస్యలు ఏమైనా ఉంటే నేరుగా తన కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వడ్రణం హరి బాబు మండల పార్టీ అధ్యక్షుడు గొడ్డల చిన్న రామారావు, గూడవల్లి నరసయ్య తదితరులు పాల్గొన్నారు.



# తెలుగుదేశం ప్రభుత్వం వచ్చాక చదువుతో పాటు క్రీడలకూ ప్రాధాన్యం ఇస్తున్నాం

- **ఎమ్మెల్యే బొండా ఉమమహేశ్వరరావు**

**విజయవాడ సెంట్రల్, జూలై 11 (మనం న్యూస్):** శుక్రవారం సాయంత్రం సెంట్రల్ నియోజకవర్గం లోని 59వ డివిజన్ సింగ్ నగర్ మాకినేని బసవ పున్నయ్య స్టేడియంలో విజయవాడ సెంట్రల్ తెలుగుదేశం యువత సెంట్రల్ ఎస్సి సెల్, సెంట్రల్ మైనారిటీ సెల్ కమిటీల ఉమ్మడిగా నిర్వహిస్తున్న ఎన్టీఆర్ మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్స్ అనంతరం ప్రభుత్వ విప్, సెంట్రల్ నియోజకవర్గ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు చేతుల మీదుగా బహుమతుల ప్రధానోత్సవం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ సెంట్రల్ నియోజకవర్గం లో ప్రభుత్వ పరంగా క్రీడాకారులను ప్రోత్సహిస్తున్నామని అన్నారు. క్రికెట్ నే కాకుండా అన్ని రకాల క్రీడా ఈవెంట్లను ప్రోత్సహిస్తామని తెలిపారు. క్రికెట్ పట్ల యువతలో ఎక్కువగా ఆసక్తి ఉందని, ఆసక్తిని గమనించి యువత ను క్రికెట్ క్రీడలో రాణించేందుకు క్షేత్రస్థాయిలో ప్రోత్సాహాన్ని అందిస్తామని తెలియజేసారు.




# దుర్గ గుడిలో జరుగుతున్న అభివృద్ధి పైన ఇఒ సమీక్షా సమావేశం

**విజయవాడ పశ్చిమ, జూలై 11 (మనం న్యూస్ )** దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానములో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై ఆలయ కార్యనిర్వహణాధికారి వి.కె.శీనా నాయక్ శుక్రవారం నాడు మహామండపంలోని 4వ అంతస్తులో ఉన్న తన చాంబర్ లో ప్రత్యేక సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో ఇంజనీర్లు, కాంట్రాక్టర్స్, దాతలు హాజరయ్యారు. రాభోయే దసరా మహోత్సవాలను దృష్టిలో పెట్టుకుని జరుగుతున్న పనులు అన్నదానం భవన నిర్మాణం, లడ్డు పోటు భవనం, ఎలివేటేడ్ క్యూ కాంప్లెక్స్, హిల్ ప్రొటెక్షన్ పనులు, పూజ మందిరాలు, యాగశాల మొదలగు పనులు వేగవంతం చేయాలనీ ఆయన ఆలయ అధికారులకు దిశా నిర్దేశం చేశారు. భక్తుల సౌకర్యార్థం భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా మాస్టర్ ప్లాన్ అమలు పై చర్చలు జరిపారు. మీటింగ్ అనంతరం పనులు జరుగు విధానంపై ఫీల్డు తనిఖీ చేశారు. ఈ కార్యక్రమములో యాగశాల డోనార్ సంగా నరశింహ రావు, ఆలయ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కోటేశ్వరరావు, ఇంజనీరింగ్ సిబ్బంది, అన్ని రకాల పనులకు సంభందించిన కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

